ప్రజాశక్తి
సోమవారం 19 డిసెంబర్ 2022 5 కర్నూలు



'హంద్రీ' సాగేనా..?

- మార్చి చివరి వరకూ ఇవ్వలేమంటున్న అధికారులు - రబీ సాగుపై అన్నదాతల ఆందోళన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

హంద్రీ నీవా మార్చి చివరి వరకూ సాగే అవకాశం కనిపించడం లేదు. డిసెంబరు ఆఖరు తర్వాత నీరు ఇవ్వలేమని అధికారులు తేల్చి చెప్పడంతో రబీ సాగుపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు...



మల్యాల ఎత్తిపోతల వద్ద పారుతున్న హంద్రీనీవా నీరు (ఫైల్)

శ్రీశైలం జలాశయం నీటి మట్టం 875.300 అడుగులకు చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వివిధ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రోజుకు 3 నుంచి 5 టిఎంసిలు వాడుతున్నాయి. దీంతో రోజు రోజుకూ జలాశయంలో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. నీటి వినియోగం ఇలాగే కొనసాగితే డిసెంబరు ఆఖరుకు లేదా జనవరి 15నాటికి 798 అడుగులు దిగువకు పడిపోయే అవకాశం ఉంది. జలాశయంలో 810 అడుగుల లెవల్ వరకు మాత్రమే హంద్రీ నీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి నీరు ఎత్తిపోసే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో జనవరి తరువాత హంద్రీ నీవా కాలువకు నీరు ఇచ్చే అవకాశమే లేదని పత్తికొండ, దేవనకొండ, గోనెగండ్ల, కృష్ణగిరి, తుగ్గలి మండలాల తహసీల్దారులకు ఇరిగేషన్ అధికారి లేఖ గతంలోనే రాశారు. గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఈ మేరకు నోటీసులు అంటించాలని, దండోరా వేయించాలని ఆ లేఖలో ఆదేశించారు. ఇప్పటి వరకూ కూడా అదే నిర్ణయంతో జల వనరుల శాఖ అధికారులు ఉన్నారు. హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 11.5 టిఎంసిలే ఎత్తిపోశారు. గత టిడిపి ప్రభుత్వంలో ఐదేళ్లు సగటున 30-35 టిఎంసిల వరకు కృష్ణా జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని కరువు పల్లెలకు ఫిబ్రవరి, మార్చి ఆఖరు వరకు సాగు, తాగునీరు ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కూడా 2020లో 40 టిఎంసిలు, 2021లో 28 టిఎంసిలు ఎత్తిపోశారు. కృష్ణగిరి, జూపాడుబంగ్లా, పత్తికొండ, వెల్దుర్తి, కల్లూరు, మద్దికెర మండలాల్లో హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి మోటర్ల ద్వారా ఎత్తిపోతలు, పందికోన జలాశయం పరిధిలో దేవనకొండ, పత్తికొండ మండలాల్లో దాదాపుగా 35 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నాయి. రబీ ఆశతో నెల నెలన్నర రోజుల క్రితమే వేరుశనగ, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు. ఎకరాకు సరాసరి రూ.25-రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. గత నాలుగైదు ఏళ్లుగా మార్చి, ఏప్రిల్ ఆఖరు వరకు సాగునీరు ఇవ్వడంతో ఈ ఏడాది కూడా మార్చి ఆఖరు వరకు సాగునీరు అందుతుందని రైతులు అప్పు చేసి పంటలు వేశారు. పంటలు చేతికొచ్చే కీలక సమయం జనవరి నుంచి నీళ్లు ఇవ్వలేమని హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు చేతులు ఎత్తేశారు. ఇదే జరిగితే రూ.350 కోట్ల పెట్టుబడులు మట్టిపాలేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దళితుల వలసలను ఆపాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - కోడుమూరు

సామాజిక న్యాయం సంగతేమో కానీ మొదట ఊళ్ళకు ఊళ్ళు ఖాళీ చేసి వెళ్లే దళితుల వలసలను ఆపి కాలే కడుపులకింత అన్నం పెట్టాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కోడుమూరు పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కెవిపిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల నాయకులు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, సిఐటియు మండల నాయకులు గఫూర్ మియాలు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికమంది వలసలు వెళ్లే ప్రాంతంగా కోడుమూరు ఉందని, అందులోనూ నూటికి 90 శాతం మంది దళితులే ఉన్న వూళ్లను, కన్న వాళ్లను వదిలి బతకడం కోసం బయటి ప్రాంతాలకు వెళుతున్నారన్నారు. జిల్లా అధికారులు కలుగజేసుకుని వలసలు ఆపి, ఉపాధి చూపాలన్నారు. లేనిపక్షంలో దళితులందరిని కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. మండల నాయకులు ఈశ్వరయ్య, వీరాస్వామి, ఏసేపు, రాంబాబు, నాగేష్, రాజు, దేవన్న, ప్రకాశం, చిన్న మల్లయ్య, దాసు, మద్దిలేటి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

క్లాప్ సాధనకు

సహకారం అవసరం

- నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణతో కూడిన ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం మరియు క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) రూపొందించిందని, ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని కర్నూలు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ కూడలి నుంచి గాయత్రి ఎస్టేట్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కూడలి వరకు కర్నూలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో చేపడుతున్న పారిశుధ్య చర్యల మార్పు, ఇందుకు ప్రజలు చేపట్టాల్సిన విధానాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ సాధిద్దామంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కర్నూలు నగర పాలక అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమాదేవి మాట్లాడారు. నగర పాలక సంస్థ ఇప్పటికే అన్ని ఇళ్లకు మూడు రకాల చెత్త బుట్టలను పంపిణీ చేశామని, ఆకుపచ్చ బుట్టలో తడి చెత్త, నీలం రంగు బుట్టలో పొడి చెత్తను, ఎరుపు రంగు చెత్తబుట్టలో హానికరమైన వ్యర్థాలను ఇంటి వద్దకే వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. వీటిపై ఇప్పటికే నగరంలో వివిధ కాలనీల్లోని ప్రజలకు కరపత్రాలు, అవగాహన సదస్సులు నిర్వహించామని త్వరలో అందరూ చెత్తను ఇంట్లోనే శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణకు మార్పులను అవలంభిచాలని కోరారు. చెత్త నుంచి ఇంట్లోనే చిన్నగా సేంద్రియ ఎరువును ఎలా తయారు చేసుకోవడంలో మహిళలకు, అలాగే చిత్తు కాగితాలతో బొమ్మలు, వివిధ అకృతులను ఎలా తయారు చేసుకోవాలో విద్యార్థులకు పలు కార్యక్రమాలను తెలియజేశామన్నారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రణకు పాటుపడదామని, కాలువల్లో చెత్తను వేయబోమని, మన ఇంటిలాగానే భావించి పరిసరాలను, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని ప్రజలు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. క్లాప్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య చర్యల్లో తీసుకొస్తున్న విధానాలను, బిన్ ఫ్రీ సిటీ మార్చిన వైనాన్ని కార్పొరేటర్లు సిత్రా సత్యనారాయణ, విక్రమ్ సింహారెడ్డి వివరించారు. రాబోయే రోజుల్లో కర్నూలు నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిద్దేందుకు నగర పాలక సంస్థ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందన్నారు. మేనేజర్ చిన్నరాముడు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్రంలో అరాచక పాలన

- మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, ప్రతిపక్షాల పార్టీ కార్యాలయాలపై అధికార పక్ష నేతలు దాడులు అధికమయ్యాయని టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ 31వ వార్డులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ఎలాంటి సమస్యలను ఎదుర్కొం టున్నారో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 31వ వార్డు ఇన్‌ఛార్జీ శైలజ యాదవ్, మాజీ ఎంపీపీ వాకిటి మాధవి, మహిళ నాయకులు రాములమ్మ, శ్రావణి, మాధవి, కల్లూరు అర్బన్ నాయకులు ఎన్‌వి.రామకృష్ణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గంగాధర్ గౌడ్, రవి ప్రకాష్ రెడ్డి, బీసన్న, గోపి కృష్ణ, రవి, శీను, మైనారిటీ నాయకులు మున్న, సులేమాన్, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి పోగు బజారన్న, బొగ్గుల ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు.

పెద్దకొట్టాలలో : కల్లూరు మండలం పెద్ద కొట్టాలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇసుక మాఫియా, కరెంటు బిల్లులు, నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగ యువత ఈ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని జగన్ రెడ్డి మోసపు హామీలు ఇవ్వడం, ఇతర ఇబ్బందులపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కల్లూరు మండల అధ్యక్షులు డి రామాంజనేయులు , నాయకులు ఎం రంగారెడ్డి, ఎస్ కాసింవలి, దాదా, కళిందర్ మాబు మదార్ సాహెబ్ పాల్గొన్నారు.



31వ వార్డులో 'ఇదేం ఖర్మ'లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

విద్యార్థులు యోగాలో

ప్రావీణ్యం పొందాలి

- ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్



పోటీలను తిలకిస్తున్న శ్రీధర్‌రెడ్డి

ప్రతి విద్యార్థి తమ జీవితంలో యోగా సాధనలో ప్రవీణ్ పొందితే మంచి ఆరోగ్యంతో పాటు ఆనందంగా ఉండవచ్చని ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆవరణలోని యోగాహనలో అవినాష్ యోగా స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా స్థాయి శాప్ యోగా లీగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో న్యాయవాది శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆధునిక జీవితంలో యోగాను అంతర్భాగం చేసుకున్నప్పుడే మంచి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. అనంతరం జిల్లా యోగా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ రమేష్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా యోగా సంఘం తరపున అన్ని విధాలుగా ముందుంటామని అన్నారు. సీనియర్ యోగా కోచ్ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర క్రీడా శాఖ ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసేందుకు లీగ్ పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. అంతకుముందు లీగ్‌లో రిజిస్టర్ కాబడిన వివిధ మండలాల నుంచి సుమారు 40 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. జిల్లా యోగా సంఘం సభ్యులు ముంతాజ్ బేగం, విజయ్ కుమార్, మునిస్వామి, శ్రీనివాస్ కళ్యాణ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న కెఇ శ్యాంబాబు

టిడిపితోనే పేదలకు న్యాయం : కెఇ శ్యాంబాబు

పత్తికొండ : టిడిపితోనే పేదలకు న్యాయం జరుగుతుందని టిడిపి పత్తికొండ నియోజవర్గ ఇన్చార్జి కెఇ శ్యాంబాబు పేర్కొన్నారు. ఆదివారం పత్తికొండ పట్టణంలోని గరీబ్ నవాజ్ కాలనీలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పేదలకు రేషన్‌తోపాటు దసరా, ఉగాది, సంక్రాంతిలకు పండుగ సరుకులతో పాటు రంజాన్ క్రిస్మస్ పండుగలకు రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక పేరిట ఉచితంగా సరుకులు అందించేవారని తెలిపారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అలాంటి కానుకలు ఎత్తివేయటమే కాకుండా అర్హులైన ఎందరో పేదల రేషన్ కార్డులు సైతం రద్దు చేసిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, గుడిసె నరసింహులు, సంజప్ప, నాయకులు పాల్గొన్నారు.

కోడుమూరు : రాష్ట్రంలో వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి నాయకులు విమర్శించారు. కోడుమూరులోని కొండపేట చేనేత కాలనీలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కొండపేట చేనేత కాలనీలో నిరుద్యోగ సమస్యలు, నిత్యవసర ధరలు, మద్యపానం, కుంటుపడిన అభివృద్ధి, ఇసుక మాఫియా, తాగునీటి సమస్య, కరెంటు చార్జీలు, మహిళల భద్రత, దుర్భరమైన రోడ్లు, డ్రైనేజీ నిధుల దుర్వినియోగం, అవినీతి, రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం, నిలకడ లేని పాలన, రాజధాని రాజకీయాలు తదితర వాటిపై ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. టౌన్ అధ్యక్షులు బిపి ఎల్లప్ప నాయుడు, ఎంటిసి తాలూకా అధ్యక్షులు గోపాల్ నాయుడు, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్ భాష, చేనేత సంఘం మండల అధ్యక్షులు కె భాస్కర్, శంకర్ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయసాయి రెడ్డి డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు కరువు

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండలోని ప్రైవేట్ విజయసాయిరెడ్డి డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు సొంత భవనం నిర్మించారు. కానీ ఆ కళాశాల చుట్టూ మురికి కాలువలు, ముళ్ల పొదలు ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపల్ లేరు. కరస్పాండెంట్ కళాశాలను కొనసాగిస్తున్నారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లు, మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యా అర్హత లేని వారితో విద్యాబోధన కొనసాగిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు కళాశాలను సందర్శించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలివ్వాలి : ఎపిడబ్ల్యూజెఎఫ్

- కర్నూలు నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా శివ, నాగేంద్ర

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలివ్వాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెబి శ్రీనివాసులు, బి.గోరంట్లప్ప, అర్గనైజింగ్ కార్యదర్శి చిన్నరామాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లోని డ్వామా సమావేశ మందిరంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ నగర కమిటీ సమావేశం చిన్నరామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడేషన్ రెన్యూవల్ గడువును అరు నెలల వరకు పొడిగించాలన్నారు. అర్హులైన వారందరికి అక్రిడేషన్ కార్డులివ్వాలన్నారు. జర్నలిస్టు హెల్త్ స్కీం జర్నలిస్టులందరికి వర్తింపచేసేలా చూడాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కర్నూలు నగర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శివ, కె.నాగేంద్ర, కోశాధికారిగా నజీర్‌భాషా, ఉపాధ్యక్షులుగా విద్యాసాగర్, సునీల్ కుమార్, రమేశ్, సహాయ కార్యదర్శులుగా శ్రీరాములు, రమేశ్, ఇసి మెంబర్లుగా జయబాబు, వెంకటేశ్, శ్రీరామ్, అభిలాష్, నాగరాజు, మధుబాబు, గంగాధర్, సుంకన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకులు పి.యూసూఫ్ ఖాన్, డి.చంద్రమోహన్, కల్లూరు మండల నాయకులు మధు, నాగేంద్రుడు, అసీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎపిడబ్ల్యూజెఎఫ్ కర్నూలు నగర నూతన కమిటీతో నాయకులు

ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



మాట్లాడుతున్న కె.బలరాం

ఉర్దూ వర్శిటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజాపరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె.బలరాం డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని స్థానిక ప్రజాపరిరక్షణ సమితి కార్యాలయంలో అయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం కర్నూలుకు ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారన్నారు. విశ్వవిద్యాలయానికి గత ప్రభుత్వ హయంలో దాదాపుగా 147 ఎకరాలు భూమి కేటాయించారన్నారు. ఇప్పుడు అ భూములకు ఉర్దూ విశ్వవిదాలయం నుంచి డబ్బులు చెల్లించాలని చెప్పడం సరైందికాదన్నారు. వర్శిటి తరగతులు నిర్వహిస్తున్న భవనాలకు ఇప్పటివరకు అద్దె చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ జోక్యం చేసుకొని వెంటనే విశ్వవిద్యాలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల గడువు పెంచాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల బదిలీల గడువును మరో రెండు రోజులపాటు పెంచాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని స్థానిక సలాంఖాన్ భవన్‌లోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు గందరగోళంగా ఉన్నాయన్నారు. సర్దుబాటు మ్యాపింగ్ ద్వారా జరిగిన ఉపాధ్యాయులకు అదనపు పాయింట్లు కేటాయించాలన్నారు. సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులందరికీ బదిలీల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

దళిత వాడల సమస్యలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించండి : కెవిపిఎస్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కేంద్రంగా ఉన్న కర్నూలు మండల చుట్టుపక్కల గ్రామాల్లో దళిత వాడల సమస్యలను అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని కెవిపిఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు వెంకటేశ్వర్లు, ఎన్‌జి.కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న కెవిపిఎస్ కార్యాలయంలో మండల ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల 10 నుండి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలలో సహితం దళిత వాడలు మురికి కూపాలుగా, సమస్యలకు నిలయాలుగా వున్నాయని చెప్పారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉల్చాల గ్రామంలో కింది పేటలో రోడ్లు, మురుగు కాల్వలు లేవని, గ్రామ మురుగు నీరంతా బయటికి పోయే మార్గం ఏర్పాటు చేయని కారణంగా దళిత పేట చివరణ మురుగు కుంటగా మారి దళితుల బతుకులను ఎక్కిరిస్తోందన్నారు. మెజారిటీ గ్రామాలలో మరుగుదొడ్ల సౌకర్యం లేక దళిత మహిళలు అవమానాల పాలౌతున్నారన్నారు. దేవమాడ గ్రామంలో నేటికీ దళితులు అంటరాని వారుగానే చూడబడుతున్నారని చెప్పారు. అధికారులు జోక్యం చేసుకోకపోతే కెవిపిఎస్‌గా సమస్యలపై నిరంతర ఆందోళన, అంటరానితనంపై ప్రతిఘటన నిర్వహించేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు జయరాముడు, సురేష్, చిన్న నాగశేషులు, నాగరాజు, సహాయ కార్యదర్శులు ఏసన్న, దేవకుమార్, చిన్నయ్య, బజారి, మద్దిలేటి పాల్గొన్నారు.



కెవిపిఎస్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో పాల్గొన్న నాయకులు



గాలికి ఊగుతున్న స్కూల్ బోర్డు

స్కూలు బోర్డు ఏర్పాటులో నాణ్యత లోపం

సి.బెళగల్ : మండలంలోని కొత్తకోట హైస్కూల్‌కు అక్కడి హెచ్‌ఎం మధు ఏర్పాటు చేయించిన పాఠశాల బోర్డు గాలికి ఊగిసలాడుతోంది. గేటుకు అటు ఇటు సిమెంట్ దిమ్మలు నిర్మించారు. ఆ దిమ్మెలలో ముందుగానే బోర్డు ఏర్పాటుకు ప్రణాళిక వేసుకోవాల్సి ఉంది. అలా కాకుండా చేత్తో సిమెంట్ పెట్టినట్లుగా పెట్టడంతో ఆ బోర్డు గాలికి ఊగుతోంది. అక్కడే విద్యార్థులు రాకపోకలు చేస్తుండగా ఏ క్షణంలోనైనా పడిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా శ్రద్ధ చూపి పటిష్టంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతయినా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

జాతీయ పోటీలకు హర్షద్ బాషా, హాసిని ఎంపిక

కర్నూల్ స్పోర్ట్స్ : మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరగబోయే యూత్ జాతీయ స్థాయి నేషనల్ బాస్కెట్ బాల్ పోటీలలో కర్నూలుకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయినట్లు ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ సంఘం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. యూత్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు కర్నూలు జిల్లా వాసులు హర్షద్ బాషా, హాసిని ఎంపికయ్యారని, వీరి ఎంపిక పట్ల కర్నూలు జిల్లా అసోసియేషన్ దాదాబాష, ముస్తహీర్, పలువురు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

కర్నూలు కలెక్టరేట్ : వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజారఘువీర్ పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాలల్లో భాగంగా ఆదివారం కర్నూలు నగరంలోని స్థానిక వినియోగదారుల ఫోరం కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిఎస్ఒ రాజారఘువీర్, వినియోగదారుల ఫోరం సభ్యులు నారాయణరెడ్డి, నబీ హాకీసర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్ఒ మాట్లాడుతూ వినియోగదారులు ఎక్కడైనా వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు పొందాలన్నారు. వినియోగదారులు తమకున్న హక్కులను తెలుసుకొని వ్యాపారుల నుండి మోసపోరాదన్నారు. వినియోగదారుల వారోత్సవాలను ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల సమాచార కేంద్రం ఇంచార్జ్ నదీమ్, ఎఎస్ఒ రామాంజనేయరెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సులను సద్వినియోగం చేసుకోండి

- ఇగ్నో సెంటర్ కోఆర్డినేటర్ సమీ ఉద్దీన్ ముజామిల్

కర్నూలు స్పోర్ట్స్ : ఇగ్నో కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉస్మానియా కళాశాల ఇగ్నో సెంటర్ కో-ఆర్డినేటర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమిల్ తెలిపారు. ఆదివారం స్థానిక ఉస్మానియా కళాశాలలో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సులు, వాటి వివరాలు, అందిస్తున్న అవకాశాలను, కళాశాల అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు. తరగతిలో సదుపాయాలు, మాదిరి ప్రశ్నాపత్రాల వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. సమావేశంలో అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రెహమాన్ ఖాన్, అధ్యాపకులు శివప్రసాద్, ఫర్హతుల్లా ఖాన్, మసూద్ అహ్మద్, డాక్టర్ గులాం హుస్సేన్, గౌస్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

టిజివి కళాక్షేత్రంలో షిర్డీసాయి నాటక ప్రదర్శన

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

స్థానిక టిజివి కళాక్షేత్రంలో షిర్డీ సాయి సచ్చరిత్ర నాటక ప్రదర్శన ఆదివారం రాత్రి జరిగింది. స్థానిక షిర్డి సాయి భక్తమండలి కార్యదర్శి, మహాబలేశ్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇటీవల దత్త జయంతి సందర్భంగా ఢిల్లీ సంస్థాన్ అధ్వర్యంలో డిశంబర్ 7న ప్రదర్శించిన ఈనాటకాన్ని ఆదివారం తిరిగి కర్నూల్లో ప్రదర్శించారు. అంతకుముందు జరిగిన సభకు అధ్యక్షులు పత్తి ఓబులయ్య సాయిబాబా చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలనం చేసి పుష్పమాలను సమర్పించారు. నగరంలో వివిధ సాయిబాబా ఆలయాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కస్తూరిబా ఘటనతో
అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- పాఠశాలను సందర్శించిన మంత్రి సోదరులు నారాయణ స్వామి, జడ్‌పిటిసి శేఖర్ జిల్లా అధికారులు

ప్రజాశక్తి-ఆలూరు


సిబ్బందితో మాట్లాడుతున్న నారాయణ స్వామి

ఆలూరు కస్తూరిబాలో శనివారం రాత్రి నలుగురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయమే జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి సునీత, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి గోపీనాథ్‌తో పాటు ఎంఇఒ కోమలదేవి, తహశీల్దార్ మల్లికార్జున, ఇన్‌ఛార్జీ ఆర్ఐ బసన్న గౌడ్, విఆర్ఒ రవి పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలలో వంట గదులను, ఆర్ఒ ప్లాంట్, సింటెక్స్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ వైద్యులు మారుతి కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మంత్రి జయరాం సోదరులు, వైసిపి ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి, జడ్‌పిటిసి ఏరూర్ శేఖర్, వైస్ ఎంపిపి భర్త శ్రీధర్, వైస్ సర్పంచి రవి, కోఆప్షన్ సభ్యులు బాషా సంఘటనపై ఆరా తీశారు. విద్యార్థినులకు నీటి కలుషితం, ఫుడ్ పాయిజన్ లేదా బయటి చెత్త డంపింగ్ యార్డులోని పొగ వల్ల జరిగిందా అనే దానిపై వైద్యాధికారులు నివేదిక, విద్యార్థుల విచారణను జిలా ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి
- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని


ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మీనాక్షి నాయుడు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు కోరారు. ఆదివారం ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నీరు తాగి ఏడుగురు విద్యార్థినులు అస్వస్థత గురయ్యారని తెలుసుకున్నామన్నారు. వారికి ఆస్పత్రిలో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చికిత్సలు అందించాలని తెలిపారు. అందుకు తమవంతు సహాయ, సహకారం అందిస్తామని చెప్పారు. నాయకులు బుద్ధారెడ్డి, జయరాం ఉన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ఎస్‌ఎఫ్ఐ ఆరా

ప్రజాశక్తి - ఆదోని


విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న నాయకులు

ఆలూరు కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యంపై ఆదివారం ఎస్‌ఎఫ్ఐ నాయకులు ఆరా తీసి పరామర్శించారు. డాక్టర్ రవికుమార్‌తో విద్యార్థినుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడారు. హాస్టళ్లలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలన్నారు.

విజేతగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ జట్టు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరు శ్రీనీలకంఠేశ్వర జాతర సందర్భంగా పట్టణంలోని వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం గోనెగండ్ల పోలీసులతో జరిగిన మ్యాచ్‌లో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న గోనెగండ్ల పోలీసులు 8 ఓవర్లలో 60 పరుగులు కొట్టారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ జట్టు 61 పరుగులు చేసి విజయం సాధించారు. ఇప్పటికే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ జట్టు ఈ మ్యాచ్‌తో రెండో విజయం సాధించింది. జట్టుకు సారథిగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గోపాలకృష్ణ వ్యవహరించారు.

'రెవెన్యూ'లో అవినీతి...

- నూతన తహశీల్దారైనా అరికట్టేనా..?
- పనిని బట్టి అక్రమ వసూళ్లు
- రూ.లక్షల్లో చేతులు మారుతున్న సొమ్ము
- అరికట్టడంలో విఫలమైన ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - నందవరం

ప్రభుత్వం నుంచి రూ.వేలకు వేలు జీతాలు తీసుకొని ప్రజలకు సేవ చేయాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమ సంపాదనే ధ్యేయంగా ప్రతి పనికో రేటు నిర్ణయించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. 'మేమేం తక్కువా' అన్నట్లు సచివాలయ రెవెన్యూ అధికారులు కూడా లంచాలు లేనిదే పని చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్క రెవెన్యూ శాఖలోనే నెలకు రూ.లక్షల అవినీతి సొమ్ము బదిలీ అవుతున్నట్లు సమాచారం. ఇప్పుడు కొత్త తహశీల్దార్ బాధ్యతలు చేపట్టారు. ఆయనైనా రెవెన్యూ శాఖలో అవినీతిని అరికట్టగలరా..? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.


నందవరం తహశీల్దార్ కార్యాలయం

నందవరం తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి, ప్రయివేట్ వ్యక్తులను పెట్టుకొని వసూలు రాజాలుగా మారారు. కొంతమంది గ్రామ రెవెన్యూ అధికారు (విఆర్ఒ)లు నేరుగా, మరికొంత మంది ప్రయివేట్ వ్యక్తులను నియమించుకొని పనిని బట్టి రూ.2 వేల నుంచి రూ.50 వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. రెగ్యులర్ విఆర్ఒలే కాకుండా తామేం తక్కువ తిన్నామా అన్నట్లు సచివాలయ విఆర్ఒలు కూడా అవినీతికి పాల్పడుతున్నట్లు తెలిసింది. కొంతమంది విఆర్ఒలు నేరుగా, మరి కొంతమంది బినామీ వ్యక్తులను పెట్టుకొని దందా కొనసాగిస్తున్నారు. రెవెన్యూ విఆర్ఒల మాదిరిగానే ఒక్కో రైతు నుంచి కొత్త ఈ-పాస్ పుస్తకం తీసుకోవాలంటే భూమిని బట్టి రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు, ఆర్ఒఆర్, అడంగల్ ఆన్‌లైన్ చేయాలంటే రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం అతివృష్టి, అనావృష్టితో నష్టపోయిన రైతులు అంత డబ్బు ఇచ్చుకోలేమని వాపోతున్నారు. 'మీరిచ్చే దాంట్లో ఆర్ఐ, డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దార్లకు కమీషన్ ఇవ్వాలి. లేకపోతే వారు సంతకాలు చేయరు' అని అధికారులు చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. రైతులను జలగల్లా విఆర్ఒలు పీడిస్తున్నారని, తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి విచ్చలవిడిగా జరుగుతుందని, ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు, విద్యావేత్తలు పేర్కొంటున్నారు. గత నాలుగేళ్ల ఇన్‌ఛార్జీల పాలనకు స్వస్తి పలుకుతూ నందవరం రెగ్యులర్ తహశీల్దార్‌గా నిత్యానంద రాజు గత వారంలో బాధ్యతలు చేపట్టారు. తహశీల్దార్ అయినా అవినీతికి పాల్పడే విఆర్ఒలపై కఠిన చర్యలు తీసుకొని రైతులకు అండగా నిలవాలని కోరుకుంటున్నారు. నూతన తహశీల్దార్ రైతులకు అండగా నిలుస్తారా లేక అందరి అధికారుల మాదిరిగానే తన రెవెన్యూ శాఖలో జరిగే అవినీతిని కప్పి పుచ్చుతారా అని వేచి చూడాలి...

సిపిఎస్‌ను రద్దు చేయాలి...
- యుటిఎఫ్ నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - ఆదోని

సిపిఎస్‌ను రద్దు చేసి, ఓపిఎస్‌ను అమలు చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వాక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ నుంచి యుటిఎఫ్ కార్యాలయం వరకు 2కె వాక్ చేపట్టారు. ఈ ర్యాలీని యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి సిపిఎస్‌ను తెచ్చాయని విమర్శించారు. దేశంలోని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్ అమలు చేయాలని కోరుతున్నా స్పందించడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను నిలువునా మోసం చేసిన జగన్‌మోహన్ రెడ్డి తమ డిమాండ్‌ను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సిపిఎస్ రద్దు కోసం అవసరమైతే చలో ఢిల్లీ ఆందోళనకు కూడా సిద్ధం కావాలని ఉద్యోగ, ఉపాధ్యాయులను కోరారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు సరైన సమయానికి ఇవ్వకుండా కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని తెలిపారు. పోరాడి సాధించుకున్న హక్కులను కూడా ప్రభుత్వం కాలరాయడం తగదన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు నారాయణ, జనార్ధన్, నర్సయ్య గౌడ్, వేణుగోపాల్, శివకుమార్ గౌడ్, వెంకటరమణ, సుధాకర్, రంగన్న, లింగన్న, బసప్ప, జంబులింగయ్య, పవన్ కుమార్, వెంకటరమణ, ధర్మన్న, అంజినయ్య, రాము, గంగాధర్, చెన్నయ్య గోవిందరాజులు, రాముడు, బాబా, మోహిద్దీన్, కృష్ణుడు, మల్లికార్జున, నాగేష్, శ్రీకాంత్, తేజ, రామ్మూర్తి, మహిళా నాయకులు రేణుకాబాయి, శిరీష, పర్వీన్, భాగ్యలక్ష్మి, తిరుమల దేవి ఉన్నారు.


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నేమకల్లు సచివాలయం

నేమకల్లు సచివాలయం ప్రారంభోత్సవానికి సిద్ధం

ప్రజాశక్తి - చిప్పగిరి

సచివాలయ అధికారులకు త్వరగా అందుబాటులో తేవడానికి సచివాలయ నిర్మాణ పనులను వేగవంతం చేయించి పూర్తి చేసినట్లు సర్పంచి ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయ పనులు పూర్తి కావడానికి సంబంధిత కాంట్రాక్టు దారులు పూర్తిగా సహకరించారని తెలిపారు. సమయానికి బిల్లులు అందకపోయినా నిర్మాణ పనులు పూర్తి చేశారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సలహా మేరకు త్వరలో నూతన సచివాలయ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. విద్యా కమిటీ ఛైర్మన్ అశోక్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


ప్రజాశక్తి- హోళగుంద

మండలంలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట దేవరగట్టు కొండ గుహలో వెలసిన శ్రీమాళ మల్లేశ్వరులకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు బారులుదీరారు. అర్చకులు పంపా స్వామి, మహేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, బండార అర్చన చేసి, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి నిర్వహించారు. మహిళ భక్తులు కింద నుంచి పైగిరి వరకు ప్రతి మెట్టుకూ కుంకుమ బండారతో బొట్టు పెట్టారు. భక్తులకు దేవరగట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. దేవరగట్టులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాష్ట్రంలో నియంతృత్వ, అరాచక పాలన
- మాచర్ల ఘటన దారుణం - మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి


రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నియంతృత్వ ధోరణితో టిడిపి నాయకులపై దాడులు చేయించడం అరాచక పాలనకు నిదర్శనమని టిడిపి రాయలసీమ ఇన్‌ఛార్జీ, మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. ఆదివారం అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక అబోడే హోటల్‌లో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాచర్లలో టిడిపి ఇన్‌ఛార్జ బ్రహ్మారెడ్డి ఇంటిపై ఆటవికంగా దాడులు చేసి విధ్వంసం సృష్టించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు సరికాదన్నారు. వైసిపి నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే భావన ప్రజల్లో వచ్చిందని, ఇది ఎంత కాలం సాగదని తెలిపారు. జగన్ సాక్షాత్తు సొంత బాబాయ్‌నే చంపేస్తే దాన్ని ప్రతిపక్షాలపై వేసి 'నారాసురా రక్త చరిత్ర' అని సాక్షి దినపత్రికలో రాయడం ఏమిటని ప్రశ్నించారు. పుంగనూరులో టిడిపి నాయకులు రామచంద్ర ఇంటిని ధ్వంసం చేసి భయానక వాతావరణం సృష్టించారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులపై దాడులు చేసి అక్రమ కేసులు నమోదు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. తనపై అక్రమంగా 22 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని, అయినా భయపడే ప్రసక్తే లేదని అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. వైసిపికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజుల దగ్గరలోనే ఉన్నాయన్నారు. మాచర్ల ఘటనలోనే కాదు, టిడిపి కార్యాలయాలు, నాయకుల ఇళ్లను తగులబెట్టి దాడులు చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం దారుణమని తెలిపారు. కొంతమంది పోలీసుల వల్ల పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో ప్రజలు అనేక సమస్యలతో విసిగి పోయారని, రానున్న రోజుల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, ఎల్లారెడ్డి, అమరేశ్వర స్వామి, వట్టేటెప్ప నరసింహులు, ఏబు పాల్గొన్నారు.

వేదవతి సాధన కోసం నేడు పాదయాత్ర
- మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - హాలహర్వి



ఆలూరు నియోజకవర్గ రైతులు, ప్రజల చిరకాల స్వప్నం వేదవతి అని, ప్రాజెక్టు సాధన కోసం ఈనెల 19న హాలహర్వి నుంచి గూళ్యం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాలో ఉన్న నీటి ప్రాజెక్టుల నిర్మాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు. వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించాలని డిమాండ్ చేశారు. వేదవతి ప్రాజెక్టు సాధన కోసం చేపట్టే పాదయాత్రకు కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, టిడిపి మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, అమర్‌నాథ్‌రెడ్డి రెడ్డి, వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మద్దతుగా హాజరవుతారని తెలిపారు. రైతులు, ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



వివాహ వేడుకల్లో కోట్ల

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని టిటిడి కల్యాణ మండపంలో జరిగిన కోసిగి టిడిపి నాయకులు నాడిగేని అయ్యన్న కుమారుని వివాహానికి హాజరైన కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి.

అధికారం శాశ్వతం కాదు...
- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని


ఆదోనిలో పర్యటిస్తున్న మీనాక్షి నాయుడు


కౌతాళంలో ప్రజలతో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

అధికారంలో ఉన్నామన్న ధీమాతో దాడులకు దిగడం వైసిపి నాయకులకు తగదని, అధికారం శాశ్వతం కాదని ఆదోని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు హితవు పలికారు. వైసిపి ప్రభుత్వ పాలనలోని లోపాలను ఎత్తిచూపి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకే టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని 31వ వార్డు కిందిగేరిలో క్లస్టర్ యూనిట్ సభ్యులతో కలిసి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనం కష్టాలు వారి నోటి వెంట వినడంతోపాటు సమస్యలపై స్పందన, ప్రజాభిప్రాయ సేకరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు ఎండగట్టినా అధికార పార్టీ నాయకులు ఓర్వలేని పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. స్పందనను చూసి ఓర్వలేకనే మాచర్లలో టిడిపి నాయకులపై భౌతిక దాడులకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఘటనకు కారకులను వదిలిపెట్టి టిడిపి నాయకులపై కేసులు పెట్టడం భావ్యం కాదన్నారు. క్లస్టర్ యూనిట్ సభ్యులు రవి, మహేష్, వెంకన్న, మహాదేవ, సిసిఐ వెంకటేష్, అశ్వత్థ నారాయణ, టిడిపి కర్నూలు పార్లమెంట్ కార్యదర్శి బుద్ధారెడ్డి పాల్గొన్నారు. విజయ్ నగర్ కాలనీలో వార్డు ఇన్‌ఛార్జీ అమర్ ప్రకాష్ ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. ప్రతి గడపనూ సందర్శించి సమస్యలు తెలుసుకుని వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. నాయకులు చిట్టి బాబు, విజయ్, కృష్ణ, నాగరాజు, కాశీం, బ్రహ్మయ్య, అయ్యప్ప, నర్స, నాగయ్య, రామాంజి, కాశీ, శ్రీకాంత్, రంగనాథ్, కృష్ణకాంత్, రవి ఉన్నారు. 16వ వార్డు అంబేద్కర్ నగర్‌లో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. 23వ వార్డు విజయ భాస్కర్ రెడ్డి నగర్‌లో వార్డు ఇన్‌ఛార్జీ డికె.జగదీష్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రభుత్వంపై వారి అభిప్రాయాలను కూడా సేకరించారు. 13వ వార్డు దామోదరం సంజీవయ్య కాలనీలో ఆ వార్డు ఇన్‌ఛార్జీ బాలాజీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. **కౌతాళం** మండలంలోని హాల్వి గ్రామంలో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అభివృద్ధి శూన్యమని, పరిశ్రమలు నెలకొల్పి సంపద సృష్టించడంలో విఫలమయ్యారని విమర్శించారు. పంటలు పండక, మద్దతు ధర లేకపోవడంతో వ్యవసాయం రైతులకు నష్టం మిగిల్చిందన్నారు. టిడిపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ అడివప్ప గౌడ్, మల్లప్ప, దర్గా మౌల, వడ్డే హుస్సేని, సోము, విశ్వనాథ్, రమేష్ గౌడ, రాజానందు పాల్గొన్నారు.

వైసిపికి తిరస్కరణ తప్పదు

ఎమ్మిగనూరు : అభివృద్ధిని విస్మరించిన వైసిపికి ప్రజల నుంచి తిరస్కరణ తప్పదని 23వ వార్డు ఇన్‌ఛార్జీ ఎస్.మహబూబ్ బాష తెలిపారు. పట్టణంలోని 23వ వార్డులో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. మహబూబ్ బాషా అధ్యక్షతన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరుకు 20 కిలో మీటర్ల దూరంలో తుంగభద్ర నది ఉంటే, 70 కిలోమీటర్ల దూరంలో రీచ్‌లను పెట్టడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం పెట్టిన రీచ్ నుంచి ఇసుక తోలితే డీజిల్‌కు, రాయల్టీకే సరిపోతుందన్నారు. కమిటీ ఉపాధ్యక్షులు, మూర్తి స్వామి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, బూత్ కన్వీనర్లు బత్తిన సూరి, విశ్వనాథ్, సురేంద్ర, బుడగ జంగం నాయకులు సోమేశ్వరరావు, బి.చంద్ర, అగ్రహారం హరి, భీమన్న, వెంకటేశ్వర్లు, చాకలి రామలింగడు, జి.వీరేష్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, బుడగ జంగం మోహన్, లక్ష్మీదేవి, ఈరమ్మ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** మండలంలోని కలుగొట్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. టిడిపి కొండన్న గౌడ్, శంకర్ గౌడ్, నరసన్న గౌడ్ పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

జగనన్న కాలనీలో రోడ్డు నిర్మాణం


భూమి పూజ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ శివారులోని జగనన్న కాలనీలో రోడ్డు నిర్మాణం పనులు మొదలయ్యాయని మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి నాయకులు జయ మనోజ్ రెడ్డి తెలిపారు. ఆదివారం కాలనీలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జగనన్న కాలనీలో సుమారు పది వేల మందికి పట్టాలు కేటాయించినట్లు తెలిపారు. మొదటి విడతగా 46 గృహాల నిర్మాణం మొదలైందని చెప్పారు. త్వరలోనే వెళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పేదలకు అప్పగిస్తామన్నారు. తాగునీరు, వీధిలైట్లు, రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. హౌసింగ్ ఎఇ ఆదినారాయణ, కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి, కాంట్రాక్టర్ ఓబుల్ రెడ్డి ఉన్నారు.


భోజనశాలను తనిఖీ చేస్తున్న పీఠాధిపతులు

భోజనశాలలో పీఠాధిపతుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న భోజన శాలను పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం ధనుర్మాసం సందర్భంగా శ్రీమఠం ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకే అన్నపూర్ణ భోజనశాలలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేపట్టారు. ఆదివారం సెలవు కావడంతో రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రసాద వితరణ సక్రమంగా జరుగుతుందా, నాణ్యతతో రుచికరంగా చేశారా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఆకస్మికంగా వచ్చి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు వితరణ చేసేందుకు వండిన పాయసం, బిసిబ్యాలేబాత్, పెరుగన్నం వంటకాలను చూశారు. నిర్వహణపై మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావును, భోజన శాల సూపర్‌వైజర్ ప్రహ్లాదాచార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోపాలూ లేకుండా చూడాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి
- నియోజకవర్గ బాధ్యులు నీలకంఠప్ప

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలో కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని నియోజకవర్గ బాధ్యులు నీలకంఠప్ప, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి మారుతి రావు కోరారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సుధాకర్ బాబు సూచన మేరకు పట్టణ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులుగా మాజీ కౌన్సిలర్ దిలీప్ దోక, కార్యదర్శిగా సాయినాథ్, సహాయ కార్యదర్శిగా నిసార్ అహ్మద్, మద్దిలేటి, పట్టణ కోశాధికారిగా మాణిక్య రాజును ఎన్నుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ పార్టీని బలోపేతం చేసే విధంగా పనిచేయాలని వారు కోరారు. యువజన నాయకులు దేవిశెట్టి వీరేష్, సుంకన్న, బాష, రాము, గోవిందు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు